# మంత్రిగారి గారడీ-మహా గొప్ప పేరడీ



టౌన్ హాల్ జనంతో కిటకిటలాడుతోంది.

సభాస్థలికి మంత్రి పుంగవులు భాగ్యారావు వేంచేశారు. ఆయన వెనకాలే స్థానిక యం. యల్.ఏ. వామన మూర్తి, మున్సిపల్ ఛైర్మన్ రంగప్రసాద్‌గారూ వచ్చారు. వారి వెంట ఊరిలోని ఛోటా, బడా నాయకులు కొందరు వచ్చారు.

అమాత్యులవారు అగుపడగానే జనంలోంచి "భాగ్యారావుగారూ... జిందాబాద్!" అన్న నినాదాలు మిన్నుముట్టాయి.

సభా నిర్వాహకుల తరపున ఒక వ్యక్తి వేదిక పైకి ఎక్కి మైక్ ముందు నిలబడి, "మహాశయులారా! మనం స్థాపించిన కుల నిర్మూలన సంఘం ఈ సుదినాన వార్షికోత్సవం జరుపుకుంటోంది. ఈనాటి సమావేశానికి ముఖ్య అతిథిగా మన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రులు, గౌరవనీయులు అయిన భాగ్యారావుగారు విచ్చేయడం మన భాగ్య విశేషం. ఈ సమావేశానికి మన నియోజకవర్గ శాసనసభ్యులైన గౌరవనీయులు వామన మూర్తిగారు అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. ఆత్మీయ అతిథిగా మనందరికీ పరమ ఆత్మీయులైన మున్సిపల్ ఛైర్మన్‌గారైన గౌరవనీయులు రంగప్రసాద్‌గారు ప్రసంగిస్తారు. గౌరవ మంత్రివర్యులు, శాసనసభ్యులు, ఛైర్మన్‌గార్లను వేదికపైకి రావలసిందిగా సవినయంగా ఆహ్వానిస్తున్నాను" అని చిరుప్రసంగం చేశాడు.

ఆహ్వానితులు అందలం ఎక్కగానే అతగాడు వేదిక దిగి వెళ్లి ముందువరసలో కూర్చున్నాడు.

వామన మూర్తిగారు నిలబడి-

"మహా జనులారా! నేడు ఎంతో సుదినం. ఈనాడు మనందరికీ మహత్తరమైన సందేశం అందించడానికి మంత్రివర్యులు విచ్చేయడం మనందరి భాగ్యం. మీరందరూ వారి ఉత్తేజపూర్వకమైన ఉపన్యాసాన్ని వినడానికి ఉవ్విళ్లూరుతున్నారన్న విషయం నాకు తెలుసు. మీరే కాదు.., నేను కూడా ఎంతో ఆత్రుతతో ఎదురుచూస్తున్నాను. అందువల్ల నేను ఎక్కువ మాట్లాడకుండా, గౌరవనీయులైన అమాత్యశేఖరుల వారిని తమ అమూల్య సందేశం అందించవలసిందిగా అర్థిస్తున్నాను" అని కూర్చున్నాడు.

జనం కరతాళ ధ్వనుల మధ్య చిద్విలాసంగా లేచి నుంచున్నారు అమాత్య శేఖరులు. చిరునవ్వు చిందిపోకుండా తలవంచి, చేతులు మోడ్చి నమస్కరించారు. వెంటనే మళ్లీ జనంలోంచి చప్పట్లు పెద్దగా మోగాయి.

ముందు కూర్చున్న సభా నిర్వాహకుడు ఛంగున స్టేజీ మీదకెక్కి-

"మహా జనులారా... ఇప్పుడు మొట్టమొదటి ముఖ్యమైన కార్యక్రమం వేదికపైనున్న ప్రముఖులను పుష్పమాలలతో సత్కరించడం. ముందుగా మంత్రివర్యులను మా మున్సిపల్ కౌన్సిలర్లు అయిన నిమ్మకాయల దబ్బయ్యగారు, గున్నపాటి పున్నారావుగారూ ప్రత్యేక పూలహారంతో సన్మానిస్తారు" అని ప్రకటించాడు.

వేదికకు వెనుకగా వెదురుబుట్టలు పెట్టిన సుమారు పది కిలోల బరువున్న కొండచిలువలాంటి గులాబీపూల మాలను సుందోపసుందుల వంటి ఆ ఇద్దరూ చెరోవైపు పట్టుకొని, ఆపసోపాలు పడ్తూ వేదిక పైకి మోసుకొచ్చారు.

మంత్రిగారిది చూడడానికి భారీకాయమే కాని.., వట్టి ఊబ శరీరం. వాపే కాని బలుపు లేనట్లు ఉంటుంది. గాలి కొట్టిన ట్యూబ్‌లాగా ఉండి పిన్ను గుచ్చుకుంటే గాలి దిగిపోయి అప్పడంలా మారే బాపతు. ఆయన ఒక మొబైల్ షుగర్ ఫ్యాక్టరీ. చక్కెర వ్యాధికి చిక్కి 'తింటే ఆయాసం.., తినకపోతే నీరసం' అన్నట్లుంటాడు.

సుందోపసుందులు ఆ మాలను అతిజాగ్రత్తగా పట్టుకొని శ్రీవారి దగ్గరకు తీసుకువచ్చారు.

ఆ దండను చూడగానే ముందు కొంచెం ఉలిక్కిపడ్డాడు భాగ్యారావుగారు. కానీ... సభా మర్యాద తప్పదు కనుక, చిరునవ్వు పులుముకొని కొంగలాగా తల ముందుకు సాచాడు.

అసలే డయాబెటిస్..! ఆపైన అప్పటికే అతివినయ భారంతో వంగిపోయిన మెడ. ఎంత నెమ్మదిగా వేసినా ఆ దండ బరువుకి శ్రీవారి మెడ గుర్రపు నాడాలాగా మరింత వంగిపోయింది.

ఒక్క దండ అయితే ఏదో సంసారపక్షంగా సర్దుకుపోవచ్చు. కాని- ఆయన అభిమానులూ, అభిమానాన్ని ఆకాంక్షించేవారూ, వారి అభిమానాన్ని బహిరంగంగా ప్రదర్శించాలని ఆరాటపడే వీరాభిమానులూ, ఆశ్రితులూ, ఆశ్రయం కోసం అర్రులు చాచేవారూ.., వగైరా, వగైరాలూ, ఆవూంబాపతు వారూ... వెంట వెంటనే తమ 'దండయాత్ర' మొదలుపెట్టారు.

దండ-దండకీ చప్పట్లు దండిగా, మరింత దండిగా మోగసాగాయి. దండల సంఖ్యలోనూ, మోగుతున్న చప్పట్ల తీవ్రతలోనూ తనకున్న పలుకుబడిని అంతరంగంలో అంచనా వేసుకోసాగారు అమాత్య శేఖరులవారు.

పుష్ప విలాసం పూర్తి అయింది.

మనసులో అయిష్టంగానే ఉన్నా మర్యాదకోసం మంత్రిగారు ఆ దండలను అతి సున్నితంగా దంతపు భరిణలను ఎత్తినట్లు జాగ్రత్తగా ఎత్తి ముందున్న బల్ల మీద ఉంచారు. ఆ గుట్ట చాటున మంత్రివర్యులు పిట్టలాగా ఉండిపోతారేమోనన్న భయంతో సభా నిర్వాహకులు తాము వేసిన భారీ దండను మాత్రం బల్ల మీద ఉంచి మిగిలిన వాటిని వెనుక బల్ల మీదికి మార్చారు. అటుతర్వాత సభామర్యాదను పాటించి తోడి పెళ్ళికొడుకుల్లాగా వేదికపైన కూర్చున్న యం. యల్.ఏ. గారికీ, ఛైర్మన్‌గారికీ పూలమాలలు వేసి చేతులు దులుపుకున్నారు.

సభ సద్దుమణిగింది. జన సమూహం అమాత్యులవారి ఉపన్యాస ఝరిలో తేలియాడడానికి చెవులు రిక్కించుకొని ఉంది. అంతటి ప్రజావెల్లువను చూస్తుంటే శ్రీవారి

ఆనందానికి అవధులు లేకుండా పోతోంది. నెమ్మదిగా మైక్‌ను పట్టుకొని దగ్గరకు లాక్కున్నారు. గొంతు సవరించుకొని ఉపన్యాసానికి ఉపక్రమించారు.

ఆన్‌లో ఉన్న మైక్‌లో ఆయన గొంతు ఉరుము ఉరిమినట్లుగా వినిపించి ఆయననే భయపెట్టింది. మైక్ కూడా భయపడిందో, ఏమో... 'కుయ్యి-'మని కూసింది. వెంటనే మెకానిక్ రంగంలోకి దూకి మైక్‌ని సరిచేశాడు.

ఈసారి మంత్రివర్యులు మైక్ టెస్టింగ్ కోసం దాని మీద వ్రేలితో తాటించారు. ఆ తాటింపు మైక్‌లో మద్దెల దరువల్లే మ్రోగింది. మైక్ ఆర్డర్‌లో ఉందన్న తృప్తితో శ్రీవారు ఈసారి గొంతు సరిచేసుకోకుండానే ఉపన్యాసానికి ఉపక్రమించబోయారు. కానీ.., కర్మకొద్దీ దగ్గు తెర వచ్చి మైక్ ద్వారా పిడుగులు కురిపించింది.

ఎలాగైతేనేం... ఈ బాలారిష్టాలన్నిటినీ తట్టుకుని మంత్రిపుంగవులు "మహా జనులారా! సోదర సోదరీమణులారా!" అంటూ ప్రారంభించారు.

'సోదర సోదరీమణులు మహా జనులు కారా?' అంటూ వెనక బెంచీ వర్గాలు కొన్ని కుశ్శంకలు, లఘుశంకలు లేవదీశాయి. అయితే అవి మంత్రిగారి చెవిదాకా రాలేదు. అందువల్ల ఆ సణుగుళ్ళు, గొణుగుళ్ళు శ్రీవారి ఉపన్యాసానికి ఆటంకం కల్పించలేదు.

"...అందువల్ల నేను చెప్పేదేమిటంటే మనం, మనందరం- అంటే... మీరూ, మేమూ అందరం కలిసి ఈ కులతత్త్వ రాక్షసిని సమూలంగా నాశనం చేయాలి. మారుమూల పల్లెల్లోని హరిజనులు, గిరిజనులు కూడా సగర్వంగా తలెత్తుకు తిరగగలిగేటట్లు చేయాలి. వారికి చిన్నపాటి అవమానం జరిగినా మనం సహించకూడదు. ఆ విషయంతో ఉదాసీనత చూపించే అధికారులపై వారు ఎంత పెద్దవారైనా, ఎంతటి ప్రముఖులైనా, ఆఖరికి మంత్రులైనా సరే... తీవ్రమైన చర్య తీసుకోవాలి."

తెచ్చుకున్న ఆవేశంతో చెప్పుకుపోతున్నారు మంత్రిగారు. ముందు సీట్లలో కూర్చున్నవారు మహదానందంతో తలలు ఆడిస్తూ, టపాకాయల శబ్దాలను మించిన శబ్దాలతో చప్పట్లు కొట్టసాగారు.

అయితే... తాగే పానకంలో పుడక పడ్డట్లు, తింటున్న ఇడ్లీలో బొద్దింక వచ్చినట్లు- అకస్మాత్తుగా శ్రీవారి ఉపన్యాసానికి అడ్డుకట్ట పడింది.

జనం మధ్యనుంచి "భాగ్యారావు డౌన్-డౌన్" అంటూ కేకలు వినిపించాయి.

ఈ హఠాత్పరిణామానికి అమాత్యులవారు అవాక్కయిపోయారు. వేదిక మీదున్న ప్రముఖులు వెలవెలబోయారు. ముందుసీట్ల వారి మెడలు అప్రయత్నంగా వెనక్కి తిరిగాయి.

సభా నిర్వాహకుడు మైకు దగ్గరకు వచ్చి, "మహాశయులారా! దయచేసి నిశ్శబ్దంగా ఉండాలని ప్రార్థన! మన దేశంలో, అందులోనూ మన రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని సహించలేని, మన ప్రభుత్వం సాధించిన ప్రగతిని చూసి అసూయపడేటటువంటి దుష్టశక్తులు కొన్ని, కొందరు సి.ఐ.ఏ. ఏజంట్‌లు, ఒక విదేశీ హస్తం కల్లోలాలను సృష్టిస్తున్న విషయం మీ అందరికీ తెలిసినదే! అలాంటివారికి గట్టి గుణపాఠం నేర్పాలి. ఎవరైనా ఏదైనా చెప్పదలుచుకుంటే అధ్యక్షులవారి అనుమతి తీసుకుని మైక్ దగ్గరకు వచ్చి మాట్లాడవచ్చు. లేదా అడగదలచుకుంటే కాగితం మీద రాసి పంపవచ్చు. అంతేకానీ, అల్లరి చేయవద్దనీ, మన ఊరి గౌరవాన్ని నిలపమనీ మనవి!" అంటూ చిన్నసైజు ఉపన్యాసం ఇచ్చాడు.

నినాదాలు ఇస్తున్నవారు ఏమనుకున్నారో, ఏమోకానీ... అల్లరి చల్లారిపోయింది.

అదంతా తన వాక్ప్రవాహపు ప్రభావమేనని మురిసిపోయి కళ్ళు మూసుకుని తన్మయత్వంతో తలాడించేశాడు సభా నిర్వాహకుడు.

మరో రెండు నిమిషాలలో రిలే రేస్‌లోలాగా అంచెలంచెలుగా ఒక కాగితం జనం చేతుల మీదుగా అధ్యక్షుల వారి హస్త కమలాలకు అందింది.

అందులోని విషయం చదివి ఆముదం తాగినట్లు ముఖం పెట్టారు వామన మూర్తిగారు. వమనం వచ్చేటట్లున్న వారి ముఖారవిందం చూసి ఆందోళనను కప్పిపుచ్చే దృక్కులతో పరస్పరం ముఖాలు చూసుకున్నారు భాగ్యారావుగారు, రంగప్రసాద్‌గారు.

"అందులో ఏముందో చదవండి!" అంటూ జనంలోంచి కేకలు వినిపించాయి.

తప్పదన్నట్లు ఆ కాగితం మీద రాసున్న విషయాన్ని చదివారు వామన మూర్తిగారు.

"ఇటీవల మన మంత్రివర్యులు మహర్షి పట్టణానికి వెళ్లి స్వామివారి ఆలయాన్ని సందర్శించారు. ఆ సమయంలో వారి వెంట స్థానిక యం. యల్.ఏ. కూడా వెళ్లారు. అయితే ఆయన హరిజనుడైన కారణంగా ఆయనను ఆలయంలోకి ప్రవేశించనీయకుండా అవమానపరిచారు ఆలయ నిర్వాహకులు. తన సరసనే సాటి నాయకునికి అంతటి అవమానం జరుగుతున్నా కిమ్మనకుండా ఉండిపోయారు మీరు. ఈ వార్త పత్రికలలో ప్రముఖంగా వచ్చింది కూడా. మీరు ఈ చర్యను ఖండించడం కానీ, కనీసం వివరణ ఇవ్వడం కానీ జరగలేదు. మరి– మీరే ఈ వేదిక మీద హరిజనులను అవమానించే వారిని, వారు ఎంతటి పెద్దవారైనా, ఆఖరికి మంత్రులైనా ఉపేక్షించకూడదనీ, శిక్షించాలనీ ఉపన్యాసం దంచుతున్నారు. సాంఘిక సంక్షేమ మంత్రిగా ఉండిన మీరు, మీ సమక్షంలోనే గౌరవనీయుడైన హరిజన నాయకుడికి అవమానం జరిగితే కిమ్మనకుండా ఊరుకున్నారు. యం. యల్.ఏ. గతే ఇలా ఉంటే సామాన్య హరిజనుల సంగతేమిటి? మీరు ఏ చర్యా

తీసుకొనకపోవడం, ఆ చర్యను సమర్థించడం కాదా? మీరు వల్లించే ఆదర్శాలు, సూత్రాలు నేతి బీరకాయలో నేతి వంటివేనా? మీ ఉపన్యాసాలూ, ఉద్బోధలూ వేదికలకే పరిమితమా?" అని నిలదీసి ఉంది అందులో.

ఆ వాక్యాలు వింటూ ఉంటే మంత్రిగారికి గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయ్యింది. కాళ్లు వణికాయి.., కళ్ళు బైర్లు కమ్మాయి. పెదవులు తడి ఆరిపోయాయి. నాలుక పిడచగట్టుకుపోయింది. అతిప్రయత్నం మీద మాటలు పెగల్చుకొని, నూతిలోంచి మాట్లాడుతున్నట్లు హీనస్వరంతో–

"మహా జనులారా! ఇప్పుడే అధ్యక్షులవారు దుష్టశక్తులు, సి.ఐ.ఏ. ఏజంట్లు చేస్తున్న దురాగతాల గురించి ప్రస్తావించారు. ఈ శక్తులే అక్కడ జరిగిన సంఘటనను కావాలని వక్రంగా చిత్రించాయి. ఇందులో విదేశీ ప్రచ్ఛన్న హస్తం పాత్ర ఉందని నేను ఘంటాపథంగా చెప్పగలను. ఈ విషయమై నేను రేపాక సుదీర్ఘమైన ప్రకటన చేయబోతున్నాను. ప్రస్తుతం మాత్రం ఈ సంఘటనతో నాకు ఎటువంటి సంబంధం లేదనీ, అసలు ఆ విషయం నాకు తెలియనే తెలియదనీ పత్రికలలో చూసిన వెంటనే వివరణలు కోరాననీ, ఇది విచారణలో ఉన్న అంశం కనుక ప్రస్తుతం ఇంతకంటే ఎక్కువ చెప్పలేననీ మాత్రం మనవి చేసుకుంటున్నాను" అని చెప్పి కుర్చీలో చతికిలపడ్డారు.

ఆ నాలుగు మాటలు చెప్పేసరికి భాగ్యారావుగారికి ముచ్చెమటలు పోశాయి.

మంత్రిగారి సమాధానం ఎవరికీ రుచించలేదు. మళ్లీ గొడవ మొదలైంది. సభ అర్థాంతరంగా ముగిసింది.

ఈ అధ్యాయం ముగిసిపోలేదు. మహర్షి పట్టణం సంఘటన గురించి శాసనసభలో నానా రభసా జరిగింది. ప్రజలలో తీవ్రమైన కోపావేశాలు పెల్లుబికాయి. ఊరూరా, వాడ వాడలా ఈ సంఘటనను ఖండిస్తూ సభలూ, సమావేశాలూ జరగసాగాయి. గోడల మీద 'భాగ్యారావుని మంత్రివర్గం నుంచి తొలగించాలి. ఆయన శాసన సభ్యత్వానికి రాజీనామా చేయాలి' అన్న రాతలు దర్శనం ఇవ్వసాగాయి. కరపత్రాల పంపకం జోరుగా సాగింది.

పరిస్థితి ఇలా మారుతుందని మంత్రిగారు కానీ, ముఖ్యమంత్రిగారు కానీ ఊహించలేదు. ప్రజల ఆవేశం ఇలాగే ఉంటే ఆ ప్రవాహం ప్రభుత్వ పునాదులనే కదిపివేస్తుందన్న భయం వేసింది. పరిస్థితి తీవ్రత గురించి ముఖ్యమంత్రి ముందు భాగ్యారావుతో ఆంతరంగికంగానూ, అటు తర్వాత మంత్రివర్గంతో అత్యవసరంగానూ సమావేశం జరిపారు. సముద్ర కెరటాలు ఉవ్వెత్తున వస్తున్నప్పుడు తల వంచక తప్పదని గుర్తించారు.

ఆనాటి రేడియో, టీవీ వార్తలలో మహర్షి పట్టణం సంఘటన విషయంలో తనకి ప్రత్యక్ష సంబంధం లేకపోయినా... ప్రజాభిప్రాయాన్ని గౌరవించి మంత్రి భాగ్యారావుగారు తమ రాజీనామా లేఖను ముఖ్యమంత్రికి సమర్పించినట్లు వచ్చింది. పత్రికలన్నీ ఈ వార్తను మొదటి పేజీలో ప్రముఖంగా ఫోటోలతో సహా ప్రచురించాయి.

మంత్రిగారు రాజీనామా చేయడంతో ప్రజల ఆవేశం చల్లారింది. ప్రతిపక్ష సభ్యులు కూడా రభస చేయడం ఆపివేశారు. చేయాలనుకున్న ప్రజా ప్రదర్శనలూ, ర్యాలీలూ ఆగిపోయాయి.

రోజులు గడిచాయి.., వారాలూ గడిచాయి.., నెలలు గడుస్తున్నాయి!

మంత్రిగారి రాజీనామాను ముఖ్యమంత్రి ఆమోదించలేదు.

భాగ్యారావుగారు దానిని ఉపసంహరించుకున్నదీ లేదు. దానిని ఆమోదించమని పట్టు పట్టనూ లేదు. ప్రజలు మళ్లీ ఆ విషయాన్ని పట్టించుకోనేలేదు. ఎంతైనా వారికి జ్ఞాపకశక్తి తక్కువ కదా!

సెక్రటేరియట్ సమీపంలో స్టార్ హోటల్లో ప్రఖ్యాత మెజీషియన్ 'ధనం రెడ్డి' మాజిక్ ప్రదర్శన జరుగుతోంది. దానిని తిలకించడానికి ముఖ్యమంత్రి, భాగ్యారావుగారూ, ఇతర మంత్రులూ, అధికారులు వచ్చారు.

ముఖ్యమంత్రిగారు, భాగ్యారావుగారూ, మరికొందరు మంత్రులు ముందు వరుసలో కూర్చున్నారు.

ధనం రెడ్డిగారు– "మహాశయులారా! ఇప్పుడు మీకొక విచిత్రం చూపుతాను అని భాగ్యారావుగారితో సార్... మీ జేబులో కాగితాలు ఏమైనా ఉంటే ఇలా ఇయ్యండి!" అన్నారు.

"నా జేబులో కాగితాలు ఏముంటాయి? ఒక రాజీనామా లేఖను ఎప్పుడూ జేబులో పెట్టుకు తిరుగుతుంటాను" అన్నారు భాగ్యారావుగారు.

"పర్వాలేదు. అదే ఇయ్యండి" అన్నాడు రెడ్డిగారు.

భాగ్యారావుగారు దానిని బయటకు తీసి ధనం రెడ్డికి అందించాడు.

"మహా జనులారా! ఇదిగో... ఇది భాగ్యారావుగారి రాజీనామా లేఖ. దానిని మళ్లీ వారికే ఇచ్చేస్తున్నాను" అని తిరిగి ఇచ్చేశాడు.

భాగ్యారావుగారు దానిని తిరిగి జేబులో పెట్టుకున్నారు.

"అబ్రకదబ్ర" అని, "సార్... ఆ లేఖ మళ్లీ ఒకసారి ఇలా ఇస్తారా?" అని అడిగాడు ధనం రెడ్డి.

భాగ్యారావుగారు జేబులో చేయి పోనిచ్చారు. "అరే... ఏమైందీ? ఇక్కడే పెట్టాను. కనిపించడం లేదు" అంటూ మిగిలిన జేబులు కూడా వెతుక్కోసాగారు.

"అయ్యా... మంత్రిగారి రాజీనామా లేఖ మాయం అయిందట. మీ ఎవరి జేబుల్లోకైనా వచ్చిందేమో కొంచెం చూసుకుంటారా?" అన్నాడు ధనం రెడ్డి.

అందరూ తమ జేబులు చూసుకోసాగారు.

"అయ్యా... ముఖ్యమంత్రిగారూ! తమరు మరోలా అనుకోకపోతే ఒక్కసారి తమ జేబు కూడా చూస్కుంటారా?" అన్నాడు ధనం రెడ్డి.

ఇబ్బందికరంగా ముఖంపెట్టి ప్రక్క జేబులోకి చేయి పోనిచ్చారు ముఖ్యమంత్రిగారు.

అంతే... తేలు కుట్టినట్లు ఒక్కసారి చేయి పైకి లాక్కున్నారు. దాంతో పాటు ఆ రాజీనామా లేఖ పైకి వచ్చింది. "అరే... ఈ రాజీనామా లేఖ నా జేబులోకి ఎలా వచ్చిందీ?" అన్నారు ఆశ్చర్యంగా పైకి.

"భాగ్యారావుగారి రాజీనామా లేఖ ముఖ్యమంత్రిగారి జేబులోకి ప్రవేశించింది. ఆ లేఖ సమర్పించవలసింది ఆయనకేగా!" అన్నాడు ధనం రెడ్డి నవ్వుతూ.

సభికులు హర్షాతిరేకంతో చప్పట్లు చరిచారు.

"అయ్యా... ముఖ్యమంత్రిగారూ... తమరు దయచేసి ఆ రాజీనామా లేఖను మరోసారి తీసి ఇలా ఇస్తారా?" అన్నాడు ధనం రెడ్డి.

ముఖ్యమంత్రిగారు జేబులోకి చేయి పోనిచ్చారు. ఆ లేఖ తగల్లేదు. చేతిని బాగా పోనిచ్చి వెతికారు. కనిపించలేదు. జేబును తిరగేసి చూశారు. అయినా కనిపించలేదు. మిగిలిన జేబుల్లో కూడా వెతికారు. ఎక్కడా కనిపించలేదు.

ఆ లేఖ మాయమయింది. "మీరే ఏదో చేశారు!" అన్నారు ముఖ్యమంత్రిగారు.

"మాయమయిందా? ఉష్ కాకీ అయిందన్నమాట! ఇంక అది కనిపించదు" అన్నాడు ధనం రెడ్డి.

హాలు చప్పట్లతో దద్దరిల్లిపోయింది.

తన రాజీనామా లేఖ శాశ్వతంగా మాయమవడంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నారు భాగ్యారావుగారు.

– రచన... ప్రత్యేక సంచిక... మే '98